# ఎరువు సొమ్ము

చెన్న సుశీలారామం



"అమ్మాయ్ సుందరీ! ఈ గొలుసు జాగ్రత్తగా పట్టుకెళ్ళి సావిత్రి అత్తయ్యగారికిచ్చి వస్తావా? పెళ్ళికెళ్తున్నానని అడగ్గానే ఎరువిచ్చారు. రెండు రోజుల్లో వచ్చేద్దామనుకున్న ప్రయాణం నాల్గు రోజులు పట్టింది. ఏమనుకుంటున్నారో ఏమో...నేనే వెళ్ళి ఇచ్చేసి వద్దును...ప్రయాణం వల్ల చాలా అలసటగాను, కాళ్ళు నొప్పులుగాను వున్నాయి. ఇందు కాగితంలో పొట్లం కట్టాను. భద్రంగా పట్టుకెళ్ళి ఇచ్చేసిరా...బంగారం ధర మండిపోతోంది గూడాను. జాగ్రత్తే అమ్మా..." హైమవతి, కూతురికి పదే పదే జాగ్రత్తలు చెబుతోంది.

"ఏంటమ్మా నువ్వు మరీను. అన్నిసార్లు చెబుతావేంటి? నేనేవన్నా చిన్న పిల్లనా...అజాగ్రత్తగా ఉండటానికి? గొలుసు ఇచ్చేసి అరగంటలో వచ్చేస్తాను"తల్లితో చెప్పి, పొట్లం కట్టిన గొలుసు పట్టుకుని గుమ్మం దాటింది సుందరి.

ఆ పిల్ల వెళ్ళిన కాస్సేపటికి, ఎదురింటి వారబ్బాయి వగరుస్తూ వచ్చాడు..."ఆంటీ... ఆంటీ... మీ సుందరిని పక్క వీధిలో స్కూటరు గుద్దేస్తే పడిపోయింది."

హైమవతి గుండె జారిపోయింది. హడావుడిగా ఇంటికి తాళం పెట్టేసి, ఆ కుర్రాడి వెంట బయల్దేరింది. పడిపోయిన సుందరిని పక్కనే షాపులో కూర్చునున్న సావిత్రిగారబ్బాయి సురేష్ లేవదీసి కూర్చోబెట్టి సోడా పట్టించి ఆసుపత్రికి తీసుకెళ్ళడానికి రిక్షా పిలిచాడు. గట్టి దెబ్బలేం తగల్లేదు గాని మోకాళ్ళు, చేతులు గీరుకుపోయాయి. నుదురు చిట్లి రక్తం కారసాగింది. పోస్టర్లు చూస్తూ రాంగ్‌సైడ్‌లో వచ్చెయ్యడం వల్ల సుందరిదే తప్పని అంతా అన్నారు. హైమవతి వెళ్లేసరికి సుందరిని సురేష్ రిక్షాలో తీసుకెళ్తూ కనిపించాడు. వాళ్ళ వెనకే తనూ రిక్షాలో బయల్దేరింది హైమవతి.

గాయాలకు మందు పూసి, ఇంజక్షనిచ్చి పంపించాడు డాక్టరు. కాస్సేపటికి హైమవతి వాళ్ళింటికొచ్చింది సావిత్రి.

"ఏంటండీ వదినగారూ మా సురేష్ చెప్పాడు సుందరిని స్కూటర్ గుద్దేసిందటగా!"

"అవునండీ వదినగారూ! సమయానికి దేవుడిలా మీ అబ్బాయి వచ్చి, దాన్ని ఆసుపత్రికి తీసుకెళ్ళాడు. రండి ఇలా కూర్చోండి..."

సావిత్రి కాస్సేపు కూర్చుని ఆ మాటా ఈ మాటా మాట్లాడి, వెళ్తానంటూ లేచింది. "వదినగారూ నా గొలుసు ఇస్తారా? సాయంత్రం పేరంటం ఉంది. అందుకే పని కట్టుకుని వచ్చాను. మీరు ఇచ్చేవరకూ ఆగకుండా ఇలా వచ్చి అడుగుతున్నానని మరోలా అనుకోకండి."

సావిత్రి మాటలకు అయోమయంగా చూసింది హైమవతి. మంచంలో పడుకుని వున్న సుందరి లేచి కూర్చుంది. "అదేంటండీ అత్తయ్యగారూ! అలా అడుగుతున్నారు? ఉదయం మీకు గొలుసు ఇచ్చాను కదా! మీ ఇంటి నుంచి వస్తుంటేనే బజార్లో నాకు యాక్సిడెంటయ్యింది."

కోపంగా చూసింది సావిత్రి. "ఏంటమ్మా సుందరీ! ఎదురు నన్నే దబాయిస్తున్నావా? ఐతే

నేను అబద్ధమాడుతున్నానంటావా? వస్తువు నాకు అందితే నేనెందుకు అడుగుతాను?''

"వదినగారూ! కోపం తెచ్చుకోకండి. మీరు అబద్ధమాడతారని కాదు, కాని ఉదయం నేనే సుందరితో మీ గొలుసు పంపించాను. అది మీకిచ్చి వస్తున్నప్పుడే స్కూటరు గుద్దిందని చెప్పింది అమ్మాయి.''

"చాల్లే ఊరుకోండి హైమవతిగారూ! మీరూ అదే మాట అంటున్నారా? ఐనా చిన్న పిల్ల చేతికి బంగారం వస్తువిచ్చి పంపడమేంటి? దార్లో ఎక్కడ పడేసిందో...మీరు కోప్పడతారని అబద్ధం చెబుతోంది మీ సుందరి. ఐనా మీరు పంపారో లేదో ఎవరికి తెలుసు? అందుకే అంటారు మా వారు...బంగారు వస్తువులు, ఎంత దగ్గరవాళ్ళకైనా సరే ఎరువు ఇవ్వద్దని. నేనే బుద్ధి లేక మీకిచ్చాను. పోనీలే గదాని ఇస్తే ఇంత నాటకమాడతారా? చూడండి వదినగారూ! మావారికసలే ముక్కు మీదుంటుంది కోపం. ఆయన ఊర్నుండి రేపో మాపో వస్తారు. ఈ విషయం తెలిస్తే నాకు చీవాట్లు, చెప్పు దెబ్బలు వేస్తారు. అంతే గాదు మిమ్మల్నీ వదిలి పెట్టరు. ఆనక... అలాగన్నారు, ఇలాగన్నారు అని బాధ పడితే మాత్రం ప్రయోజనం ఉండదు. ఆయన ఆవేశంతో, నోటికెంత వస్తే అంతా అనేస్తారు. అంతేకాదు, మాకివ్వాల్సిన వస్తువుని... దాని ఖరీదు బట్టి ఏ రూపేణానైనాసరే మీ దగ్గర్నుంచి ముక్కు పిండి మరీ వసూలు చేస్తారు. మర్యాదగా రేపు ఉదయం పది గంటలకల్లా మా వస్తువుగాని... దాని విలువ... డబ్బు రూపంలో గాని నాకు అంద చేస్తారా, సరే! లేకుంటే తర్వాత ఏం జరుగుతుందో మీరే చూద్దురుగాని'' హెచ్చరించి అక్కడ్నుంచి గబగబా వెళ్ళిపోయింది సావిత్రి.

నిశ్చేష్టులై నిలువు గుడ్లేసుకునుండిపోయారు తల్లీకూతుళ్ళిద్దరూ. మిన్ను విరిగి మీద పడ్డట్టైంది హైమవతికి. ఏం చెయ్యడానికీ ఆమెకు కాళ్ళు చేతులాడ్డం లేదు. కంగారు వల్ల ఆమెకు ఒంట్లో వణుకు పుట్టుకొస్తోంది. ఆ వస్తువు కొనిచ్చే తాహతు లేదు వాళ్లకు. అందుకే కాబోలు...ఎరువు సొమ్ము బరువు చేటు అంటారు. కాని, హైమవతి విషయంలో, ఎరువు సొమ్ము...పరువుకు చేటులా తయారైంది. ఆమె భర్తకు అలాంటివి ఇష్టముండవు. కాని, ఆడ మనసు గదా- పెళ్ళికెళ్తూ...మనసు చంపుకోలేక నలుగుర్లోనూ దర్పంగా ఉండాలని సావిత్రి నగ పట్టుకెళ్ళింది. కాని ఇలా జరుగుతుందని ఆమె ఊహించలేదు. భర్త ఆఫీసు పని మీద వూరెళ్ళి వారం రోజులైంది. రెండు రోజుల్లో వస్తాడతను. హైమవతి గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నంత రొదగా, దడగా ఉంది.

ఇంతలో హేమంతరావు లోనికొచ్చాడు. "అదేంటే అక్కా...అలా కూర్చున్నావ్? అరె సుందరికి ఆ కట్లేంటి? ఏం జరిగిందసలు?'' హైమవతి తమ్ముడు హేమంతరావు అడిగాడు. అతనొచ్చి మేనకోడలి పక్కన కూర్చున్నాడు. తమ్ముడ్ని చూస్తూనే చెప్పలేనంత దుఃఖం పొంగుకొచ్చేసింది హైమవతికి. జరిగిదంతా వివరంగా చెప్పింది. ఏవేవో ప్రశ్నలడిగాడతను...

"సర్లే...నువ్వేం కంగారు పడకు. ఈ సమస్యకు పరిష్కారం నాకొదిలేయి. ఉండు, నేనిప్పుడే వస్తాను...''హడావుడిగా బైటపడ్డాడు హేమంతరావు.

హేమంతరావు డియరెస్టు ఫ్రెండు ఒకతను, ఆ ఊళ్ళోనే పోలీసు ఎస్సైగా పని చేస్తున్నాడు. సరాసరి అతను పోలీసు స్టేషన్కెళ్ళాడు. విషయమంతా స్నేహితునికి వివరించాడు. సుందరికి, స్కూటరు యాక్సిడెంటైనపుడు ఆమె దగ్గర సావిత్రి కొడుకు సురేష్ దగ్గరే వున్నాడని, సుందరికి దెబ్బలు తగిలి పడిపోయినపుడు ఆమె చేతిలోని నగ సురేష్ కాజేశాడని అతని మీద హైమవతి పోలీసు కంప్లైంటివ్వగా సురేష్ని అరెస్టు చేసి తీసుకెళ్లారని కబురొచ్చింది సావిత్రికి.

అంతే ఆమె గుండెలు బాదుకుంటూ పోలీస్టేషన్కెళ్ళింది. అక్కడి దృశ్యం చూసి ఆమె గుండె బేజారైపోయింది. సురేష్ని పోలీసులు లాఠీలతో సత్కరిస్తుంటే ఆ దెబ్బలు తనకే తగిలినట్లు విలవిల్లాడిపోయింది. తక్షణం రెండు చేతులూ జోడించింది.

"ఎస్సైగారూ! నా కొడుకు నిర్దోషి. వాడికే పాపం తెలీదు. నేనే బుద్ధి గడ్డి తిని వస్తువు అందలేదని అబద్ధమాడాను. సుందరి బంగారు గొలుసు తెచ్చి నాకప్పగించింది. దయచేసి నా బిడ్డనొదిలెయ్యండి.''

ఆమె కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. కొడుకుని విడిపించుకెళ్తూ స్టేషన్ బైట నిలబడ్డ హైమవతి వైపు చూళ్లేక సిగ్గు, అవమానభారంతో కుంచించుకుపోతూ తల నేలకు వాల్చింది సావిత్రి.

హైమవతి తమ్ముడితో కలిసి ఇంటికొచ్చింది. "తమ్ముడూ సమయానికి నువ్వు వచ్చావు కనుక ఈ గండం గట్టెక్కించావురా. లేకుంటే, మీ బావగారొచ్చాక చాలా గొడవయ్యేది. సావిత్రి భర్త అసలే నోటి దురుసు మనిషి. ఇంటిమీదికొచ్చి గొడవ పెడితే ఇంకేమైనా ఉందా? మీ బావ నన్ను బతకనిచ్చేవారు కాదు. నువ్వు ఊర్నించి రావడం నా అదృష్టం రా, దేవుళ్ళా వచ్చి మంచి ఉపాయం ఆలోచించి నన్ను రక్షించావు. లేకపోతే ఈ జన్మకు అంత డబ్బు పోసి ఆ నగ కొనివ్వగలిగేవాళ్ళమా?''

"అక్కా! అసలు మీ ఆడాళ్ళెందుకు ఇలాంటి రిస్క్ తీసుకుంటారు? ఆభరణాలు ఉంటే వేసుకోవాలి. లేకుంటే లేదు. వస్తువులు పెట్టుకుని వెళ్లకపోతే ఏమిటి నష్టం? అవతలి వాళ్ళు రానివ్వరా? బావ తిడతారు, చంపుతారు అంటున్నావ్...అవును మరి...బావకు పరువు మర్యాదలు ముఖ్యం. ఎరువు సొమ్ములు నిజంగా పరువుకు చేటే మరి. ఇంకెప్పుడూ ఇలాంటి తెలివి తక్కువ పన్లు చెయ్యకు. పద... పద... నాకు ఆకలి దంచేస్తోంది. త్వరగా భోజనం వడ్డించు.'' అక్కగార్ని తీసుకుని వంట గది వైపు నడిచాడు హేమంతరావు.

